# ఇంటి నంబరు

డాక్టర్ అప్పలరాజు నీట్‌గా సర్దిన గదులకేసి చూసి తృప్తిపడ్డాడు. ఉక్కు నగరంలో ఇంటికోసంవారం రోజులు తెగ తిరిగితే ద్వారకానగరంలో అయిదొందలకి రెండుగదులవాటా దొరికింది. ఇంక తన రాణిని బయల్దేరి రమ్మని ఉత్తరం రాయాలి. అది చేస్తే ఆరోజుకి అనుకొన్న వన్నీ పూర్తిచేసినట్టే.

రాజు పనిపూర్తయ్యాక అరబక్కెట్టు నీళ్ళతో పొదుపుగా స్నానం చేశాడు. మిగిలిన అరబక్కెట్టు మర్నాడు పొద్దున్న నీళ్ళువచ్చేవరకు ఇతర అవసరాల కోసం ఆదా చేశాడు. పంచ లుంగీలా చుట్టుకొని ఫాన్ కెదురుగా కూర్చుని ఉత్తరాని కుపక్రమించాడు.

"రాణీ! నా పాటకు బాణీ!

ఇల్లు దొరికేసిందోచ్! ఇంక నువ్వు సామాన్లుకట్టేసి, మీనాన్నని రైలెక్కించమను- నేను దింపుకొంటా. ఇల్లు చక్కగా సర్దాను. అమెరికాలోలా ఉండదనుకో! అమెరికా ఇండియాలో ఉంది కనుకనా! అక్కడ నువ్వేమన్నావు! ఒక ఎన్టీలేడు ఓఏ యన్ లేడు. తెలుగు సినిమాలు, ఫ్రెండ్స్ బేస్‌మెంట్లలో ఇరుక్కుని చూడటమేగాని చక్కగా ఎయిర్ కండిషన్డ్ హాల్లో అర్ధడాలర్కే కుషన్ సీట్లో దర్జాగా కూర్చుని చూడగలమా ఇండియాలోలా అన్నావు! మల్లెపూలు లేవు. ఉన్నా వాసన లేని పువ్వులన్నావు! తెలుగు సినిమాలేని పురంబు ఎందుకూ కొరగానిది అప్పలరాజ శిఖామణి! అన్నావు. అందుకని మన్దేశం వచ్చేశాం. ఇక్కడ అద్దెకి ఇళ్లు లేవు. ఇళ్ళకి మోడర్న్ కిచెన్లూ, సింకులూ లేవు. రోజులో పదిగంటలెలక్ట్రిసిటీ లేదు. టాప్సులో నీళ్లు లేవు. అయితేనేం సింహాచలం సంపెంగి పూలున్నాయి. కిళ్ళీలున్నాయి. సోడాలున్నాయి. ఇవాళ ఇక్కడ ఉష్ణమాపకం 42డిగ్రీల సెంటిగ్రేడు చూపించింది. ఎన్ని సోడాలు తాగానో తెల్సా. ఇక్కడ నిమ్మకాయ సోడాలూ వుంటాయి. అవి కూడా అమెరికాలో లేవు. విశాఖపట్నంలో నువ్వు లేవు. ఇందుకే చల్లగా లేదు. వచ్చేయ్ త్వరగా" అని పూర్తిచేశాడు. ఆపైన ఇంటి బయటకు వెళ్ళి ఇంటి

నంబర్ చూశాడు. 48-12-15. చాలా ఇంటరెస్టింగ్ నంబర్. నాలుగు ఎనిమిది కూడితే పన్నెండు. మధ్యభాగం పన్నెండు, ఒకటి రెండు కూడితే మూడు. ఈ మూడు ఇంతకు ముందు పన్నెండు కలిపితే పదిహేను. ఉన్న సంఖ్యలు కూడగా వచ్చే మొత్తాలు.

ఈ విషయం తనకి కాకుండా ఎవరికైనా తట్టి ఉంటుందా అని ఆలోచించాడు. అప్పల్రాజు. తను నిజంగా మేధావి! జీనియస్. మరీ వినయం లేకుండా స్వోత్కర్ష మంచిది కాదు - శ్రీనివాస రామానుజం ఇల్లాంటి విషయాలు అవలీలగా గుర్తించేవాడుట. తనూ అతగాడూ పోటీ పడ్తే ఏమో ... అతను గెలిచినా గెలవ్వచ్చు. అయినా ఆ పెద్ద మనిషికేనాడో నూకలు చెల్లిపోయాయి. ఇంక బతికున్నది తను. తనపేరులో కూడా 'రా', 'జు' ఉన్నాయి... తను నిస్సందేహంగా అంకెల విశిష్టతను అర్థం చేసుకోగలిగినవాడు. అంకెలకి తనకి అవినాభావ సంబంధం. తను ఒకసారి చూసిన సంఖ్యను మరిచిపోడు.

తన ఎడ్రస్ భార్యకి రాయక పోతే ఆమె ఇంటికి జవాబు వ్రాయలేదు - ఆఫీసుకి వ్రాస్తుంది. అందుకని ఫ్రమ్ ఎడ్రస్ వ్రాయాలి. రాజు తన పేరు చెక్కాడు. ద్వారకానగర్, విశాఖపట్నం - అని వ్రాశాడు. పిన్‌కోడ్ వ్రాయబోయాడు. గుర్తురాలేదు! తను శ్రద్ధగా ఆ సంఖ్యని గమనించలేదు. గుర్తుంచు కోవాలని ప్రయత్నం చెయ్యలేదు. అందుకని గుర్తు లేదు. పోనీ కొంపలుమునగవు ఆ నంబర్లేక పోతే! ఇంటి నంబర్ వెయ్యాలి. ఎంత అది? 12-3-15 రాజుకి అనుమానం వచ్చింది. ఆ నంబర్ అది కాదు. మరేది! మళ్ళీ వెళ్ళి చూడాలి! తనలాంటి జీనియస్... అవమానం కదా! ఆ... రామానుజం కూడా హార్డీ పక్కన లేనప్పుడు అనుమానం వచ్చిన సంఖ్యల్ని మళ్ళీ మళ్ళీ దొంగచాటుగా స్టడీ చేసి ఉండడా! ఇంకోసారి చూస్తే తప్పు లేదు.

అప్పలరాజు బయటికి వెళ్లి తలుపు మీద నంబర్ మరోసారి చూశాడు. అర్థమై పోయింది. రెండు ఒకట్లు, ఒక రెండు, ఒక నాలుగు, ఒక అయిదు, ఒక ఎనిమిది. 48-12-15 వెరీ సింపుల్. ఉత్తరం మీద ఫ్రమ్ ఎడ్రెస్‌లో నంబర్ వేశాడు. ఇంకా పోష్టు చెయ్యాలి. టైమ్ చూసుకొన్నాడు. ఎనిమిది గంటలైంది. ఊటీలో భోజనం చేసి దార్లో ఉత్తరం పోష్టు చేసి రావచ్చు. పాంట్ వేసుకోబుద్ధి కాలేదు. అమెరికాలో ఇస్త్రీల్లేని బట్టలు, చిరిగిపోయిన లాగూలు ఎవడిష్టం వచ్చినట్టు వాడు వేసుకోవచ్చు గాని ఇండియాలో ఎందుకని మనుషులు వేసుకోరాదు! వేసుకోం అంతే. వేసుకోకూడదని ఎవరన్నారు! ఇండియాలో చొక్కా లేసుకోక పోతే లేదను కొంటారే గాని తాపం భరించ లేక అనుకోరని భయం. మొన్న మటుకు మొన్న కాకినాడలో ఇంట్లో అందర్నీ కార్లో వేసుకొని ఎండగా ఉందని చొక్కా తీసేసి డ్రైవ్ చేస్తున్నాడు. అప్పటికీ బనియన్ ఉంది. ఇంతలో తన రాణికి గోలీ సోడాలు, అందులోనూ అయిస్‌వి కనిపించాయి. "ఏమండీ!" అని ముద్దుగా వాటిని చూపించింది తనకి. తాను కారాపి, "నాలుగు అయిస్‌సోడాలు" అన్నాడు కొట్టతన్తో.

అతను నాలుగు సోడాలు కొట్టాడు. తను ముందు తాగితే మూడే తీసుకువెళ్ళి కార్లో అందించవచ్చు కదా అని తాగబోతుంటే షాపతను, "ముందు కార్లో అయ్యగారికీ, అమ్మగారికీ సోడాలు ఇచ్చిరా -ముందుగ నువ్వు తాగుతున్నావేటి? మర్యాదలేకుండా. ఈ కాకినాడలో పూర్వం ఎంత మర్యాదగా ఉండేవోళ్లం. పక్కూళ్ళనుంచి జనంవచ్చి పడిపోయారు. మర్యాదలన్నీ మంటగలసి పోయాయి" అని లెక్చరిచ్చాడు. ఎందుకు అతడు తన్ని డ్రైవరుగా ఊహించాడో అప్పల్రాజు కర్థం కాలేదు. ఇంతట్లో తన బావమరిది దిగి "బావగారూ!" అని " నా చేతికివ్వండి" అని సోడాలందుకొని పరువు కాపాడాడు.

"ఏంటండీ బావగారికి మంచి చొక్కా అయినా కుట్టించారు కాదు. ఏంమర్యాద? మనూరోరి అల్లుడు చొక్కా లేకుండా కార్లో ఊరంతా తిరుగుతుంటే మనూరి పరువేంగాను" అని ఆ షాపతను కూడ పొరపాటు పడటంవల్ల కలిగిన కోపాన్ని రాజు బావమరిది మీదకు మళ్ళించాడు. ఇటీజ్ ఒకే - అతని మీద అల్లాంటివేమీ పన్చెయ్యవు. తనకి చొక్కా పెట్టలేదు. పైగా తన లీవాయిలాగు అడిగి తీసుకొన్నాడు. అది వేరే కథ.

తను ఈ దేశంలో ఫాల్స్‌వాల్యూస్‌ని మారుస్తాడు. పెట్టెలోంచి అమెరికాలో నీగ్రోల ఫావరెట్ ఎర్రబనియన్ తీశాడు. దానికి కాలర్ లేదు. జేబుంది. జేబులో పదిరూపాయల నోటు పెట్టుకొన్నాడు. ఇల్లు తాళం వేశాడు. ఉత్తరం చేత్తో పుచ్చుకున్నాడు. ఎంపోరియం దాకావచ్చి రిక్షా ఎక్కి హోటల్ వూటీకి పోనిమ్మన్నాడు.

రిక్షా దిగగానే పోస్టుడబ్బా కనిపించిందోచోట. వెళ్ళి రాణికి రాసిన ఉత్తరం పోస్టు చేశాడు. "ఏటిబాబు డబ్బివ్వకుండా ఎళ్ళిపోనారు!" అన్నాడు విసుగ్గా రిక్షావాడు.

"మర్చిపోయాను. సారీ! అయామ్ వెరీ సారీ! లోపల మార్చి ఇస్తాను" అని చెప్పి హోటల్లో పదిమార్చి రిక్షావాడికి డబ్బిచ్చాడు. బనియన్ జేబు చాలా ఇరుకు. అందుకని పర్సు లేదు. పది రూపాయలు నోటు మడిచి అందులో పెట్టాడు. మీల్స్ టికెట్ కొని మిగిలిన చిల్లర బనియన్‌జేబులో పెట్టుకొన్నాడు.

భోంచేస్తూ ఆలోచనలో పడ్డాడు.. తను ఇండియానుంచి అమెరికా వెళ్ళినప్పటికి అమెరికానుంచి ఇండియా వచ్చేటప్పటికి ధరల్లో ఎంతతేడా-తను తిరిగి వచ్చే ముందర కేంద్రంలో జనతా ప్రభుత్వం వచ్చింది. అమెరికాలో ఇండియన్స్ ఎమర్జెన్సీలో ఇండియా ప్రెస్టేజి, ఇమేజి పెరిగాయి. అని వాదించేవారు విస్కీ సిప్ చేస్తూ. తనోసారి వళ్ళమండి "ఇండియా ప్రెస్టేజ్ ఇమేజ్‌ల గురించి అంత శ్రద్ధతీసుకొనే మీరు ఇక్కడేం చేస్తున్నారు? పదండి "ఇండియాపోయి వాటిని బిల్డ్ చేద్దాం!" అన్నాడు, విదేశాలలో పెద్ద జీతాలు సంపాదిస్తూ సుఖజీవితాలు గడుపుతూ 'మా ఇండియా చాలా గొప్పది' అని డబ్బాలు కొట్టడం మాత్రమే ఇండియాతో వారికున్న సంబంధం. వాళ్ళు ఇండియాలో ఇండియన్స్‌కి ఎట్లాంటి ప్రభుత్వం కావాలో, రావాలో, ఇండియాకేది మంచో ఏది చెడో టైమ్స్ గట్రా చదివి బఫె డిన్నర్లలో విస్కీలు తాగుతూ తేల్చిపారేస్తారు. వాళ్ళకున్న దేశాభిమానం ఎవరికీ లేదనుకుంటారు.

వాళ్ళు "ఎమర్జెన్సీని క్రిటిసైజ్ చేసే మీరేం చేస్తున్నారిక్కడ? అక్కడకు వెళ్ళి నిరసన తెలియజేయండి" అన్నారు.

తను దానికోసం కాకపోయినా మిగిలిన భారతీయుల్తోపాటు కష్టనిష్టూరాలు అనుభవిస్తూ దాంతోపాటు మా దేశం చాలా గొప్పదేశం అనేభావంతో జీవించడానికి వచ్చేశాడు.

ఆలోచిస్తూ రాజు భోజనం పూర్తిచేసేసరికి తొమ్మిదైంది. బయటకువచ్చి కిళ్ళీ వేసుకుని నెమ్మదిగా దిక్కులుచూస్తూ నడుస్తుంటే ఒకచోట,

"కొంటె క్రిష్ణుడు-చిలిపిరాముడు నేడే చూడండి ఆలసించిన ఆశాభంగం" అన్న పోస్టరు కనిపించింది ఎత్తుగా, పెద్దగా రంగురంగులతో.

ఓహో రేపుండదు కాబోలు. రేపు వెళ్ళవచ్చులే అనుకొంటే ఆశాభంగం కలుగుతుందని హెచ్చరిస్తున్నారీ హాలు వాళ్ళు అనుకొన్నాడు.

"పోనీ వెళ్తే... చాలా మంచి కాస్ట్ ఉంది... రాణి కాకినాడలో ఈ సినిమా చూశానని రాసింది. రేపు ఆదివారం పొద్దున్నే నిద్రలేవకపోయినా నష్టం లేదు. ఏ హాలుట? రాజు పోస్టరు చూశాడు. ఆ హాలు ఇందాక తను రిక్షాలో వస్తూ చూశాడు దార్లోనే. ఇంకా సినిమాకి పదిహేను నిముషాలుంది. అటు నడిచాడు.

రాజు సినిమా టికెట్టుకొని హాల్లోకి వెళ్ళాడు. సినిమా ఆ ఊరువచ్చి శతదినోత్సవం చేసుకొంది. అందుకని టిక్కెట్టు మరీ కష్టంలేకుండా పదినిముషాల్లో దొరికింది. హాలు చాలా ఖర్చు పెట్టి కట్టినహాలు. ఎయిర్-కండిషన్ హాలులా ఉంది అని రాజు చాలా సరదా పడ్డాడు. అయితే వున్నంత మాత్రాన దాన్ని ఆన్‌చేసి తీరాలని మనమేమన్నా రాజఘాట్ల దగ్గర ప్రమాణాలు చెయ్యలేదు కదా అన్న ధోరణిలో మానేజ్‌మెంట్ దాన్ని వెయ్యలేదు. లోపల ఉక్కగా ఉంది.

రాజుకి చూసిన సినిమా చాలనిపించింది. పైగా సినిమా బోర్ కొడ్తోంది. లేచి నిలబడ్డాడు బయటికి పోడానికి.

"అసలు ఫైటింగ్‌సీన్లు, హీరోయిన్లతో స్టెప్స్, కాస్ట్యూమ్స్ ముందున్నాయి వెళ్ళకండి" అని అభిమానులు బతిమాలారు.

వెనకాతల కూర్చున్న స్త్రీలు రాజుని విసుక్కొన్నారు. అంత సహనం లేని వాళ్లు సినిమాకెందుకురావాలనీను, తొందరగా అడ్డు తప్పుకోమనీను. రాజు గేటు బయటపడ్డాడు. మేనేజర్‌గది దాటి వరండాకున్న అద్దాలతలుపులు తెరుచుకొని వీధిలో పడాలని ప్రయత్నిస్తున్నాడు, అవి తాళంవేసి ఉన్నాయి. గేటుకీపరు ఫైటింగ్‌సీను నేలక్లాసుదగ్గర నిలబడి తన్మయత్వంతో చూస్తున్నాడు. రాజు వెళ్ళి తను ఇంటికి వెళ్ళిపోవాలని తలుపులు తెరవమని అడిగాడు, అతను మేనేజర్ పర్మిషన్ కావాలన్నాడు.

రాజు మేనేజర్ పర్మిషన్ అడిగాడు, "మీరు ఇలా మధ్యలో వెళ్ళిపోతే తరువాత షోకోసం క్యూలోనిలబడ్డ ప్రేక్షకులేమనుకుంటారు?" అని మేనేజర్ రాజుని మందలించాడు.

"ఇది సెకండ్ షో తరువాత షో లేదు" అన్నాడు రాజు.

"మంచివారే ఇంకో పదిగంటల్లో మార్నింగ్ షో వుంది. అసలే రేపు సెలవు రోజు టిక్కెట్లు దొరకవని జనం ఈ పాటికేవచ్చి క్యూలో నిలబడి ఉంటారు. కొందరు కుంపట్లు తెచ్చుకుని ఇక్కడే కాఫీలు చేసుకొని తాగుతారు. వాళ్ళంతా చూస్తుండగా మీరు, సినిమా సాంతం చూడనిచ్చగించని మీరు, బయటికి వెళ్తే ఏం బావుంటుంది?" అన్నాడు మేనేజర్. ఎంతో అయిష్టంగా తలుపు తెరిపించాడు

రాజు బయటపడి చెమట తుడుచుకొన్నాడు. సినిమా చివరి వరకు ఉంచుకోమని స్లైడ్ ద్వారా విజ్ఞప్తి చేసిన సగం టిక్కెటు ముక్కను గాలిలోకి ఎగరేసి ఉఫ్ అని ఊదాడు. హాయిగా ఇంటికి నడిచి పోదాం అని నడక మొదలు పెట్టాడు.ఆడుతూ పాడుతూ పోతే ఎన్నిమైళ్ళ దూరమైనా అరమైలులా ఉంటుందని ఆర్యులన్నారని గుర్తుకు తెచ్చుకొని దార్లోఉన్న రాళ్ళను పక్కకి తంతూ డాన్సులాంటిది చేస్తూ, "రెయిన్ డ్రాప్స్ ఆర్ ఫాలింగ్ ఆన్ మై హెడ్...మైహెడ్" అని పాట ఎత్తుకొన్నాడు.

అప్పలస్వామి కనుమానం వేసింది. 'ఈ శాల్తీ గాని పిచ్చిదా లేక పిచ్చి నటిస్తున్న దొంగదా?'అని ఆ టైములో అప్పలస్వామి బీటులో ఉన్నాడు. కనీసం 'ఇద్దరు నంజికొడుకుల్నైనా నాకప్పులో యెట్టేసే' మూడ్‌లో ఉన్నాడు. రాజు కేసి మరోసారి చూశాడు. 'హవాయి చెప్పులు, సంచి, ఎర్ర బనీను, బనీను కింద పంచిమీద బెల్టు - ఇంకేటి కావాలి ఈడు కేటునాయాలు' అని పోల్చుకోడానికి.

"ఎక్కడ్రా వోనసినుకులడ్తున్నది?" అని మర్యాదగా అడిగాడు అప్పల్సామి.

"మై హెడ్ మైహెడ్ ..." అంటూ రాజు పాట ఆపాడు. "నీనెత్తి మీదనా... వోనెక్కడడ్తోందిరా ఆకాశం కేసి సూడ్రా తాగుబోతు నాయాలా" అప్పలస్వామి రాజు పొరపాటు ఎత్తి చూపించాడు.

"సార్జంట్ వాచ్ యువర్ టంగ్" అన్నాడు రాజు కోపంగా.

'ఏట్నాకింగ్లీషు రాదనుకొంటున్నావేటి? యీపు యిమానంమోత మోగించీగల్ను ఈ యేలప్పుడెక్కడ్నుంచి రాక?"

"సెకండ్‌షో నుంచి"

"ఏ సినిమా?"

"కొంటె కృష్ణుడు-చిలిపి రాముడు"

"అదిప్పుడే యిడిచిపెట్రు"

"మధ్యలో లేచి వచ్చేశాను".

పోలీసు పగలబడి నవ్వాడు. ఆ సినిమాకి వెళ్ళి అర్ధాంతరంగా లేచొచ్చినకేసు అతడి

సర్వీసులో మొదటిది. అందులోను అంత మంచి సినిమా. పోలీసు కృష్ణుడు పేల్చి పారేశాడు! అప్పలస్వామి ఆ వేషంలో తన్ని చూసుకున్నాడు. తను కూడా అంత స్మార్ట్ అని నమ్మి ఆవేషంలో లీనమై చూశాడు. మొదటి వారం బందోబస్త్‌కి అతన్ని హాలు దగ్గరుండమన్నా-రధికారులు.

"నిజమా అంత మంచిసినిమా సాంతం సూడకుండా లేసొచ్చావా?"

"మరే!"

"టిక్కెట్టు ముక్కేది?"

రాజు జేబులు వెతుక్కున్నాడు. అతనికి ఆ ముక్క పారేసిన విషయం ఆలస్యంగా గుర్తుకు వచ్చింది. ఆమాటే నెమ్మదిగా చెప్పాడు. సినిమాకి వెళ్ళని దొంగవెధవ వెళ్ళానని బుకాయిస్తే పోలీసోడు క్రాసెగ్జామినేషన్ చేసినట్టు తనూ చేశాడు. 'ఈడు ఆడిలాగా టిక్కెట్టుండి పారేసుకొన్నట్టు, యాక్షన్ సేసి పారేస్తున్నాడు'.

"ఉంటేకదా పోడానికి, ఇంతకు ఏ యింటికి పోతున్నావ్?"

"మా యింటికే"

"ఎక్కడుంది?"

"ద్వారకా నగరంలో"

"నంబరెంత?"

రాజు చిరునవ్వు నవ్వాడు. ఇంటి నంబరు చిటికిలో చెప్పేస్తాడు. అందులో రెండు ఒకట్లు, ఒక రెండు, ఒక నాలుగు, ఒక ఎనిమిది ఉన్నాయి. మనస్సులో రామానుజం ఫొటోని తల్చుకుని, దాని కేసి సగర్వంగా చూశాడు. "11-24-58" రాజు చెప్పేశాడు.

అప్పలస్వామి పోలీసు అబద్ధం చెప్తున్న దొంగకేసి చూసేటంత ప్రేమగా చూశాడు.

"వై ఆర్ యూ లుకింగ్ ఎట్ మి లైక్ దట్?"

"ఆ నంబర్ ద్వారకా నగరంలో లేదు".

రాజు కింకో సూత్రం వుండాలని గుర్తుకు వచ్చింది.

"21-15-84" మనస్సులో అనుకొన్నాడు. రెండూ ఒకటి మూడు, ఐదు ఒకటి ఆరు. ఆరు మూడుకి రెండురెట్లు, ఎనిమిది నాలుగు పన్నెండు... పన్నెండు ఆరుకి రెండు రెట్లు. రాజు తను నంబర్లు గుర్తుంచుకొనేపద్ధతికి తనే గర్వపడ్డాడు. రెండు సూత్రాలు పై నంబరుకి వర్తిస్తాయి. కనుక తన ఇంటినంబర్ అదే! అందుకని ధైర్యంగా చెప్పేశాడు.

"పద" అన్నాడు అప్పలస్వామి.

"ఎక్కడికి?"

"పోలీస్ టేసన్‌కి"

"నేనో ఫోన్ కాల్ చెయ్యటానికి రూల్స్ వున్నాయి".

"టేసన్‌కి వెళ్ళాక"

"నన్ను అనుమానంమీద కస్టడీలోకి తీసుకొంటే మర్నాడు మేజస్ట్రీట్ ముందర హాజరు పర్చాలి".

"నడుస్తావా రెండు తగల్నీనా?"

"కస్టడీలో టార్చర్ పనికిరాదు!"

"ఘర్యాదగా నడు" అంటూ అప్పలస్వామి లాఠీ గాల్లో బలంగా ఊపాడు. అది, మనుషులమీద పేల్చేముందు గాల్లో పేల్చిన బుల్లెట్ శబ్దంలాగా గంభీరంగానూ బెదురు పుట్టించేలాగానూ శబ్దం చేసింది.

రాజు పోలీసు స్టేషన్‌కి వెళ్ళాడు. అక్కడి రైటర్ "ఏటి యవ్వారం?" అన్నాడు. "ఇక్కడ నువ్వేంఅన్నా నీకు వ్యతిరేకంగా మేం వాడుకోగలం" అని అమెరికాలో తరుచు వినే పోలీసు హెచ్చరికను అందుకోనందుకు రాజుకాశ్చర్యం వేసింది.

"ఏయింటికో కన్నం యేసేందుకు బయల్దేరాడు. పట్టుకొచ్చాను. లాకప్పులో యెట్టేసి రేపొద్దున్న ఎస్సైగారికి చెప్దాం" అన్నాడు అప్పలస్వామి.

"నేను ఒక ఫోన్ కాల్ చెయ్యాలి. అది చెయ్యనియ్యటం మీ ధర్మం" అని రాజు తన హక్కుని వాళ్ళకి తెలియబర్చాడు.

" అది అట్నుంచి ఇటు ఎవరైనా ప్రమాదంలో ఉంటే చేసేందు కెట్టారు. ఇట్నుంచి చెయ్యరాదు". అని రైటర్ రాజుతో చెప్పి,

"ఇంగ్లీషు దంచేస్తున్నాడు" అని అప్పలస్వామికో చిన్న హెచ్చరికిచ్చాడు.

" ఈ రోజుల్లో అద్రానోడెవడు!" అని అప్పలస్వామి కొట్టిపారేసి అప్పలరాజుని కొట్లో పెట్టేశాడు.

డాక్టర్ రాజు అవమానం భరించలేకపోయాడు. "అయామ్ డాక్టర్ అప్పల్రాజ్! యూ విల్ రిగ్రెట్. ఈ పనికి మీరు బాధపడ్తారు. ఇప్పుడెమర్జెన్సీలేదు. రేపు మిమ్మల్ని మేజస్ట్రేట్ చీవాట్లు వేస్తాడు. వాట్ క్రైమ్ ఐ హావ్ కమిటెడ్!" కటకటాల వెనకాతల్నుంచి రాజు అరవటం మొదలుపెట్టాడు.

"ఎందుకైనా మంచిది ఎస్సైగోరికి చెప్పీ" అని రైటర్ అప్పల్సామికి సలహా ఇచ్చాడు.

"ఆయనే కదా ఈరాత్రికి కనీసం రెండు కేసులట్టుకొచ్చేమన్ను" అని సందేహించాడు అప్పలస్వామి. కాస్సేపు ఆలోచించి పక్కనేవున్న అధికారింటికి బయల్దేరాడు. ఆయన నిద్రపోయాడేమో, పోతే లేపితే ఏమన్నా అంటాడేమోనని భయపడ్తూ వెళ్ళాడు. అదృష్టం కొద్దీ అప్పలస్వామి వెళ్ళేసరికి ఎస్సై లేచే వున్నాడు. అందుకు నిదర్శనంగా చిందుల్తొక్కుతున్నాడు. వాళ్ళ అబ్బాయి ఇతగాడు నిద్రపోగా చూసి తలుపుల్జేర వేసి రెండో ఆట సినిమాకి జారుకున్నాడుట. అప్పలస్వామి నెందుకొచ్చావన్నట్టు చూశాడు.

"తప్పులేద్సార్! తవరుపట్టుకోమన్నారని పట్టేసుకొని మీ రెట్టేమన్నారని కొట్లో

ఎట్టేశాన్సార్! అడెవడో లాకప్పులో ఉండను ఇదెమర్జన్సీ కాదు. మీ బరతం పట్టిస్తానని నోరు పారేసుకొంటున్నాడ్సార్. మీరోపాలొచ్చి చూసి ఉంచేమంటే వుంచేస్తానండి ఒగ్గమంటే ఒగ్గేస్తానండీ'' అని అప్పలస్వామి మనవి చేసుకొన్నాడు.

కొడుకొస్తే స్టేషన్‌కి తీసుకురమ్మని ఇంటిదగ్గర జవాన్‌తో చెప్పి స్టేషన్‌కి బయల్దేరాడు ఎస్సై.

"వేరీజ్ యువర్ ఆఫీసర్? ఏడి మీ బాస్?'' అని అరుస్తున్న కేకలువిన్నాడు.

"నేనే. ఏమిటి కథ?'' అన్నాడు ఎస్సై.

"అడ్రెస్ చూడండ్సార్! అర్ధరాత్రి పూట సినిమా లింకా ఒగ్గేయని టైములో నెత్తిమీద వోన్చినుకు లడ్తున్నాయంటూ పాడ్తున్నాడ్సార్. సినేమానుండి అంటాడు. టికెట్ లేద్సార్!'' అప్పలస్వామి టూకీగా కేసు చెప్పాడు.

రాజు రెచ్చిపోయాడు. "బట్టల్చూసి మర్యాద చెయ్యరాదన్న కథలు తెలుగులో ఎన్ని వచ్చాయి''? ఆమాటకొస్తే మీరేసుకొన్న బట్టలేమిటి? మీ ఐ.డి. కార్డేది? రాజు డబాయింపుకు ఎస్సై తలతిరిగి పోయింది. ఎస్సై లుంగీ బనియన్‌లతో 'సిరికింజెప్పడు శ్రీహరి' లా బయల్దేరాడు. ఎందుకైనా మంచిదని, 'ఒకటి తగలీ్న' అన్నాడు.

రామభక్తుడిలాంటి అప్పల్సామి అంత పనీ చెయ్యబోయాడు. కటకటాలడ్డుపడ్డాయి.

"యూ హావ్ నో రైట్ టు టార్చర్, ఇటీజ్ ఫర్ ది కోర్ట్ టు పనిష్ మి! అదయినా నాలో తప్పుంటే!''

ఆర్గ్యుమెంట్స్ అవుతుండగా ఇంటి నుంచి జవాను ఓ పదహారేళ్ళ కుర్రాడిని వెంటపెట్టుకొని వచ్చాడు.

"నాకళ్ళు కప్పి పోగలననుకున్నావురా రాస్కెల్'' అంటూ ఎస్సై ఆ కుర్రాడిని ఓ లెంపకాయ కొట్టాడు. కుర్రాడు "అమ్మో!'' అని ఏడ్చాడు.

"అబ్బాయిని ఎందుక్కొడుతున్నారు? వాళ్ళ తండ్రిచేత రేపు కేసుపెట్టిస్తాను. నేను సాక్ష్యం ఇస్తాను.''

"ఏటి అయ్యగారు ఆ కుర్రోడ్ని కొట్రాదా!'' రైటర్ ఆశ్చర్యంగా అడిగాడు.

"కొట్టరాదు. ఆయనెవడు కొట్టడానికి మధ్యలో పోలీసుల దౌర్జన్యం......'' అని రాజనగానే అలవాటుకొద్దీ ఆ కుర్రాడు, "నశించాలి!'' అన్నాడు. రాజు పాత అలవాటుకొద్దీ మరోసారి నినదించాడు. కుర్రాడు ఉత్సాహంగా వంతపాడాడు.

"వీడ్నెక్కడ్నుంచి పట్టుకొచ్చారు. వదిలిపెట్టేయండి పెద్ద న్యూసెన్స్‌లా ఉన్నాడు'' అని ఎస్సై ఆర్డర్ ఇచ్చాడు విసుగ్గా. రాజు బయటపడి. "హైదరాబాద్‌లో మీ చుట్టాల ఇంటినంబరెంత?'' అని రాజు ఎస్సైనడిగాడు. ఎస్సై గుర్తు తెచ్చుకోబోయాడు. చేతిలోంచి కుర్రాడు తప్పించుకు పారిపోయాడు.

"ఇక్కడ నా ఇంటినంబర్ నాకూ తెలియదు'' అని చిలిపిగా అంటూ రాజు బయటికి నడిచాడు. ●

(జ్యోతి మాసపత్రిక మే 19 81)